


## ఎలికట్టె శంకర్‌రావు

# స్టేటస్ సింబల్

కథ

**పొద్దు నిప్పుకనికోలిగ మండుతుంది. కాకకు బండలు నెర్రెలిడ్సుతున్నయ్. ఇంత గొడితె పొద్దు బలంతమ్మెనె తల మీదినుంచి పైకి లేవనేలేదు.**

**సంద్రజెట్లు, పీకతుమ్మలు ఒక్కొక్కటి వొరుగుతున్నయ్. గొడ్డండ్లు చెట్ల మొదళ్ల మీద దరువేస్తున్నయ్. చెక్కపేల్లు ఎగిరిపడుతున్నయ్.**

ఓ పెద్దబొత్త నీడన అద్దాల రామారావు కూలోల్ల దిక్కు సూస్కుంట కూసుండు. ఇంతసేపు ఎండకు మాడ బగ్గుమంటుంటె నీడకొచ్చిండు. ఆయన ఆలోచనలన్ని ఆ పదెకరాల సుట్టే తిరుగుతున్నయ్.

నీల్లసుక్క జూడక నోరుతెర్సిననేల, ఇంతకాలం అడివోలిగుంది. గాశారం బాగుండి కాల్వొస్తుంది. ఇంగ బతికి పోవొచ్చు. ఇన్నాళ్ల పడ్డ కస్టం - పెట్టుకున్న ఆశలు తీరబోతున్నయ్. ఆ ఆశతోనే పొతం జేపిస్తుండు.

'ఏం పాపులూ! ఇయ్యాల అయిద్దంటవా? ఇంక నలుగుర్ని తీస్క రమ్మంటెనేమో దొర్కుత లేరంటివి' అద్దాల రామారావు మేస్త్రి పాపులు రావటం సూసి అడిగిండు.

పాపులు నోట్లె బీడిముక్క యిసిరి 'ఆఁ గీ గింతమంది ఏం పీకుతరయ్య. కాస్త చెట్లా. ఒక్కొక్కటి గుదుమకు గుదుమోలిగుంది. రెక్కలు బోతున్నయ్. వోన్ని రమ్మన్నా గా పని ఒప్పుకున్న గీ పని ఒప్పుకున్న అని' అనుకుంట దగ్గెరకొచ్చి నిలబడ్డడు.

నిజమే. శిన్న శిన్న చెట్లా. వొసం బెరిగినట్టు బెరిగె అనుకుండు అద్దాల రామారావు.

రొండు దినాల సంది చెట్లు కొడుతుండ్రు. ఓ దిక్కు పొక్లెయినర్ మొద్దులు పీకుతుంది. దానికి గూడ కూలోల్ల పెట్టొచ్చు గని గాడ్డికొడుకులు పీకలేక వొగిరిస్తరు. పైంగ కూల్లు ఎక్కువైతయ్. పైసలు పోయినా పొక్లెయినరయితెనే ఒక్క పూటల పొతం జేసిపోతది. తర్వాత పనిగురించి ఆలోచన జేసిండు.

'ఇంతకు కాల్వొస్తదంటరాయా' పాపులు గొంతులో అనుమానం.

'ఆఁ రాకేంజేస్తదివాయ్. సర్కారు మారింది రైతుల గురించి బానే ఆలోచిస్తుంది. అయినా మనకోసం గాకున్నా తెలంగాణ అడుగకుంట ఉండాలన్నా ఆ నీల్లేదో తెచ్చి తీరాలె' అద్దాల రామారావు బొత్తకమ్మలు వేల్లతో తుంచుకుంట అన్నడు.

పాపులు పొడుగ్గా గాలొదిలి ఏమోనయ్యా, మీనమ్మకమే మరి. యెన్టీ రామారావు ముక్కెమంత్రిగున్నపుడు కూడ బాటల పొంటి కాలువబొందలు సూపిచ్చి ఊరిచ్చి ఊరిచ్చిపోయిండు. మల్ల ఈ ముక్కెమంత్రి. బాటలపొంటి కాలువలైతె సూపిస్తుండు. ఏవైతదో సూడాలె మరి' అన్నడు.

'ఎప్పుడొక్కతీర్గ ఉంటాది. అయ్యాల పరిస్థితి వేరు ఇయ్యాల వేరు. ఏ ముక్కెమంత్రి వొచ్చినా సచ్చినట్టు కాలువ పనులు చెయ్యాల్సిందే. మనకు నీల్లియ్యకుంటె ముక్కెమంత్రి సీటుకిందికి నీల్లు రావూ?' అద్దాల రామారావు రాజకీయాలు తెల్సిన మనిషోలిగ మాట్లాడిండు.

'ఏమోనయ్యా వొస్తుంది వొస్తుందని అందరు ఆశ పడుతుండ్రు. ఏండ్లకొద్ది పడావు పడి దిక్కు సూడని భూములు కూడ పొతంజేస్తుండ్రు. అనుకుంట పాపులు రుమాలు సుట్టుకొని పనికల్ల కదిలిండు.

అద్దాలాయన కండ్లు మూసుకొని ఆలోచన్ల బడ్డడు.

తేటగ అద్దమోలిగ మెరుస్తుంది భూమి. కాలువ గలగలా పారుకుంట వొస్తుంది. తన పదెకరాలు నాటు పెడితె పచ్చగ నిగనిగలాడుతుంది. తృప్తిగ సూసుకుంటుండు పొలాన్ని.

అట్ల కలగంటున్న అద్దాలాయినకు దుమ్మురేపుకుంట వొస్తున్న కారు కనిపించింది. ఈ మట్టి బాటన కారెవరిదబ్బా అనుకుంట అద్దాలు సరి చేసుకొని చూసిండు.

కారు వేగం తగ్గి బొత్తలకు అంత దూరాన ఉన్న బాటమీద ఆగింది. కార్లనుంచి నలుగురు తెల్లబట్టలోల్లు దిగి బొత్తలరొకు కదిలిండ్రు.

ఆ మనుషులు తనకోసమేనని అద్దాల రామారావుకు అర్థమైంది. వాల్లు దగ్గెరికొచ్చేసరికి లేసి నిలబడ్డడు. ఎవలూ తెల్సిన మన్సులు కారు. అయినా తనకాడికెందుకొస్తరు. అనుకుని పలకరింపుగా నవ్విండు.

'మీరేనా రామారావు'

తెల్లబట్టలోల్ల దాంట్లె గదిమట్టంగ వున్న వో మనిషి వేల్లతో మీసాలు సరిచేసుకుంట అడిగిండు.

రామారావు తలూపి 'మీరు...' అన్నడు.

'నా పేరు గంగిరెడ్డి. ఈయన ప్రసాద్ డాక్టర్. ఆయన బంగారం షాపు మల్లయ్య. ఈయన బట్టలషాపు నీలయ్య' ఒక్కొక్కరి దిక్కు వేలు పెట్టి సూపుకుంట చెప్పిండు.

అద్దాల రామారావు తలూపి 'ఎటో పోతుండ్రు పనిమీద?' అడిగిండు.

'ఈ బాటెంట భూములు దొరుకుతయేమోనని యెల్లినం. అట్ల జాడలు దీసుకుంట దీసుకుంట వొస్తున్నం' గంగిరెడ్డి వొచ్చిన ముచ్చెట చెప్పిండు.

రామారావుకు సొంతం అర్థమైంది. తను అనుకున్నది నిజమే. ఈ నడుమ కాలువొస్తుందన్న పుకారు లేసిందగ్గెరి నుంచి బాటమీద జనాలు తిర్గుతుండ్రు. మట్టిరోడ్డయినా నల్లగొండ నుండి సక్కటి రోడ్డు. ముషంపల్లి దాటినంక మూడు కిలోమీటర్లు. తిప్పి తిప్పి గొడితె నల్లగొండ నుంచి పన్నెండు కిలోమీటర్లు. అందుకనే నల్లగొండల పైసలున్నోల్ల కండ్లన్ని ఆ బాటరొకు భూముల మీదనే పడ్డయ్.

'తోవ తప్పి వొచ్చినట్టుంది' రామారావు నవ్వుకుంట అన్నడు.

'ఆఁ ఏంలేదు. వెతుక్కుంటనే వొస్తున్నం' అన్నడు.

నల్లగొండోల్లు ఎగబడ్డంక భూముల రేట్లు విపరీతంగ పెర్గిపోయినయ్. మొన్నటిదాంక ఎకరానికి పదివేలన్నా మల్లి సూసిన దిక్కు

లేదు. అట్లాంటిది ఆర్నెల్లల్ల ఎకరానికి అరవైవేలదాంక బేరమొస్తుంది. అప్పటికే ఊల్లె ఒకలిద్దరు అమ్మింద్రు కూడ. రామారావుకు మారుతున్న పరిస్థితులు యాదికొచ్చినయ్.

'డాక్టర్‌సాబ్‌కు ఓ పదెకరాలు కావాలె. ఏన్నన్న దొరుకుతదేమోనని...' గంగిరెడ్డి సూసుకుంట అడిగిండు. ఆ సూపులో నీకు పదెకరాలు ఉందని తెలిసే వొచ్చినం అన్న భావం కనపడ్డది రామారావుకు.

'అట్లనా' అన్నడు రామారావు పొడిపొడిగా.

బక్కపల్లుగున్న ఆ డాక్టరు గుర్తొచ్చిండు. ఫిజీషియన్. గొల్లగూడ దవాకాండ్ల డాక్టరు. బెయిట ప్రయివేటు ప్రాక్టీసు. రోగుల పీక్కతిని నాలుగు వేతుల సంపాయిస్తుండని పేరు. సర్దిజేసి పొయినా అయి దొందలకు తగ్గకుంట పరీక్షలు రాస్తడని పేరు.

అంత పుక్కడి సొమ్మును ఏం జేసుకుంటరు. ఎంత దర బెట్టయినా ఇంత భూమి కొనుడు తోటో గీటో పెట్టి ఇగో దీనిమీద సంపాయించిన అని లెక్కలు సూపుడు. నిజానికి అట్లాంటోల్ల యవుసాయం మీద పెట్టుబల్లకు రాబడికి పొంతనుండదు. పంటలు నిండముంచినా లెక్కల్లో లాబపడ్తనే వుంటరు.

'మరి యిక్కన్నయితె ఎవలూ లేరు. ఆ పోయినేడే మా పక్కగెట్టాయిన అమ్మితె మిరాలగూడెం బారు షాపాయిన కొన్నడు. పదేను ఎకరాలు. అగో అదే. ఇగ ఈ సుట్టుపక్కల పదెకరాల ఏకాండి కిత్త ఎవలికి లేనట్టే' రామారావు తనకు తెల్సిన సమాచారం చెప్పిండు.

ఆ విషయాలన్ని గంగిరెడ్డికి ముందే తెలుసు. భూముల బ్రోకరుగా ఆ సుట్టుపక్కల ఊల్లన్ని తిరిగినోడు. ఎవలికెంతుంది. రేటెంత పలుకుతుంది? అన్ని కొట్టినపిండి.

ఇంగ సూటిగ చెప్పక తప్పింది కాదు గంగిరెడ్డికి.

'డాక్టర్ సాబ్ భూమి మీద కాయిష్ చేస్తుండు. మంచి రోకున్న భూమైతే వో వెయ్యి అటిటు అయినా పర్వాలేదంటుండు' గంగిరెడ్డి గొంతు రామారావు పదెకరాల గురించే మాట్లాడుతున్నట్టుంది.

రామారావు మాట ముచ్చట లేకుంట నిలబడెసరికి,

'నువ్వే అమ్ముతవని జాడ తెలిసింది. చెప్పరాదు ఓ పైస అటో ఇటో' గల్లె బానం ఏసిండు డాక్టరు.

రామారావుకు గుండు మీదబడ్డట్టయింది. గుండెల్లొ సూది పొడిసినట్టయ్యింది. ఇంతకాలం చేతినిండ చేసుకోవటానికి యవుసాయం లేక కూసుండు. ఇపుడు నీల్లొస్తున్నయన్న ఆశతోటి పొతం జేపిస్తుండు.

తన కొడుకు ఇంజనీరింగు పూర్తి చేసి వొచ్చిండు. వానికి అమెరికా పోవాలని కోరిక. దాని గురించి ఆడు రోజు పోరు బెడుతున్నా 'మనతో కాదు బిడ్డా' అని చెప్పుండు. అట్లాంటిది వీల్లొచ్చి అడిగితె యిస్తాడు.

'ఆహా మీరు ఎట్టిన్నరో. నాకు అమ్మే ఆలోచనేం లేదు' రామారావు ఇంక ఆ ముచ్చట సాలన్నట్టుగా అన్నడు.

గంగిరెడ్డి మల్లా అందుకొని 'ఎకరం అరవై వేలు పలుకుతుంది. తెల్వందీ ఏముంది?' డాక్టర్ సాబ్ ఒకసారే సొంతం డబ్బు చెల్లగడ్తడు. ఆలోచించుకోరి' అన్నడు.

రామారావుకు తెలుసు 'అరవై వేలు కాదు ఈ రొండుమూడు దినాల సంది ఎనబైవేల దాంక ఎకరానికి అడిగిపోతుండ్రు. అయినా తనకు అమ్మే ఆలోచన లేదు' అనుకుండు.

డాక్టరు నేల దిక్కు పట్టి పట్టి చూసిండు. మంచి ఎర్రశెల్క. చెట్టు చేమ గొట్టిస్తే మంచి సదునైన భూమి అనుకుండు.

రామారావు మొకం నల్లగ మాడిపోయింది. కండ్లల్ల ఎర్రజీరలు కనిపించినయ్. అది చూసి గంగిరెడ్డి తలతిప్పుకుండు.

'మల్లోరొండు దినాలల్ల వొస్తం ఆలోచించుకోరి' అని యెన్కకు మల్లింద్రు.

గాడిదికొడుకులు మందిని ముంచి అడ్డగోలిగ సంపాయిస్తరు. నీటివాటంగ పడిపోతరు. పైసలాశ సూపిచ్చి నోటికాడి భూమిని దోసుకుంటరు. ఈల్లు ఈ ఎత్తున కోర్లపున్నం నాడు కుక్కలోలిగ ఊర్లమీద పడి తిరుగుతుంటె ఏ రైతుకు నిద్రబడ్తది అనుకుండు.

కారు నల్లగొండ దిక్కు కదిలింది.

** ** **

అద్దాల రామారావు మంచం మీద నడుం వాల్సిండు.

నల్లగొండ నుంచి బేరగాల్లు నెలనుంచి ఊల్లె గేడిదిప్పట్లు ఆడటం తనకు తెల్సు. పండుకున్నోన్ని లేపి భూమి బేరాలు చేస్తుండ్రు. పచ్చని పొలాలు రైతు సూసుకునే యాల్ల లేకుంట అయ్యింది.

తనకో బిడ్డ. పెండ్లి జేసి పంపిండు. కొడుకు కష్టపడి ఇంజనీరింగు సీటు సంపాయించుకుండు. ఈ నాలుగైదేండ్లు ఆనికి సగేస్తందుకే నానాతిప్పలు బడ్డడు.

అంతకంటె తనేం చేయగలడు? ఇంజనీరింగు చేసినోడు ఏదో ఉజ్జోగం చేసుకోని బత్తడు.

తనతండ్రి నుంచి వొచ్చిన భూమి. ఇన్నాల్లంటె కరువుదెబ్బకు మల్లి సూడడాయె. ఇపుడు ఆశ. ఇయ్యాల అమ్ముకొని... ఆ పైసలు మూట గట్టుకొని ఏం జెయ్యాలె?

తన కొడుకేమొ గాలిమేడలు కడుతుండు. ఇంజనీరింగు... సాఫ్ట్ వేరు... అని విమానంల ఎగరాలని కలలు గంటుండు.



'బాపూ' కొడుకు ఆకాశ్ గొంతుకు కండ్లు దెర్సిండు. ఆకాశ్ ఓ కుర్సీ గుంజుకొని మంచం పక్కనే కూసుండు.

'బాపూ ఇండియాలో ఎంత కష్టపడ్డా వెట్టిచాకిరే. అదే అమెరికా పోయినమనుకో వో అయిదేండ్లల్ల పిల్ల పిల్ల తరం కూసొని తిన్నా తరగని ఆస్తి సంపాయించొచ్చు. మా ఫ్రెండ్ వాల్లన్న మూడేండ్లు అమెరికా పొయ్యొచ్చి తొంబై లక్షలు బెట్టి

*అంత పుక్కడి సొమ్మును ఏం జేసుకుంటరు. ఎంత దర బెట్టయినా ఇంత భూమి కొనుడు తోటో గీటో పెట్టి ఇగో దీనిమీద సంపాయించిన అని లెక్కలు సూపుడు. నిజానికి అట్లాంటోల్ల యవుసాయం మీద పెట్టుబల్లకు రాబడికి పొంతనుండదు. పంటలు నిండముంచినా లెక్కల్లో లాబపడ్తనే వుంటరు.*



అపార్ట్‌మెంట్ కొన్నడు తెలుసా? అదే ఇండియాలో ఉంటె తొంబై వేలు కూడా సంపాయించలేము ఆలోచించుమరి'.

ఆకాశ్ ఆలోచనలన్నీ అమెరికా సుట్టే. రామారావుకు తల తిరిగి నట్టయ్ లేసి కూసుండు. 'అదిసరే కాని ఇపుడు అమెరికా పోవటమంటె మాటలా బిడ్డా. ఈ పరిస్థితులల్ల మన మొకం జూసి లక్షలకు లక్షలు అప్పెవడిస్తడు. ఇచ్చినా ఆ మిత్తీలు మనం కట్టగలమా?' వీలయినంత మెత్తగా అనే ప్రయత్నం జేసిండు.

'బాపూ మంచి అవకాశం. పాస్‌పోర్టు కూడా వొచ్చింది. వీసాకు అప్లయ్ చేద్దాం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కోకొల్లలు. మన అదురుష్టం కొద్ది భూముల రేట్లు పెరిగినయ్. కొనటానికి బొచ్చెడు మంది తిరుగుతుండ్రు. ఇంకా భూమి యవుసాయమని పాత చింత కాయ ఆలోచనలతో నా భవిష్యత్తును నాశనం చేయకురి' ఆకాశ్ గొంతు లో అసహనం ధ్వనించింది.

రామారావుకు వొల్లంత మంట బెట్టినట్టుగా ఉంది. స్కూలు కాలేజి అని తిరిగినోనికి వీనికేం తెల్సు భూమి విలువ? తను అంత అల్కగ వొదులుకునేటోడయితే ఎప్పుడో పోవు. ఎన్ని తాకుడ్లు తగిలినా భూమి ని నమ్ముకొని ఉండబటికే... దాన్నంత పావురంగ సూడవటికే మిగి లింది. ఊల్లె యింతో అంతో ఖదరుంది. వీడు పిల్లగాడు. ఎంతసేపున్నా సదువు, అమెరికా ఉజ్జోగం, కెరీరు అనే మాటలే తప్ప మట్టితో అను బంధం వీని మాటల్లో కనిపిస్తుందా?

'నీ తోవ నువు చూసుకో. నీ భవిష్యత్తుకు భూమికి లింకు బెట్టకు' రామారావు కటువుగా చెప్పిండు.

** ** **

నాలుగురోజులనుంచి రోజుకోసారన్నా తండ్రికొడుకుల నడుమ ఘర్షణ జరుగుతుంది. అదే నీ మాటయితె సావటం మేలు అంటుండు ఆకాశ్.

నేను సావటం ఖాయం అని రామారావు అనుకుంటుండు.

ఊల్లె రోజుకో బేరం జరుగుతుంది. పొద్దున ఉన్నరేటు పొద్దూకేసరికి పెరుగుతుంది. ఊల్లె ఎవలినోట విన్నా బేరాలే. రొండెకరాల ఆసాములు యిద్దరు ముగ్గురు జమై ఏకాండి పదెకరాలు చేసి బేరాలు పెడ్తుండ్రు. వొచ్చే టోల్లు కూడ ఒకటి రొండెకరాలు అడిగే నాథుడు లేడు.

'ఈ బొచ్చుల యవుసాయమని ఇంతకాలం కండలు కరిగిచ్చుకున్నం? ఏం బావుకున్నం? పంటలు పండించి యేనన్న ఎనకేసేది తప్పిందా? కలల సూడని దరలు పల్కుతున్నయ్. అమ్ముకొని బేంకిలేసుకొని మిత్తి తినుకుంట పన్నా- బతుకు గడిసిపోతది'.

విసిగిపోయిన రైతుల నోటెంట ఈ నడుమ వినబడుతున్న మాటలు.


రామారావు కుడితిల బడ్డ ఎలకోలిగ గిజగిజలాడుతుండు. ఇంటి ముంగల కారాగిన సప్పుడుకు తొంగి సూసిండు. కొడుకుతో పాటు గంగిరెడ్డి, డాక్టరు ఇంకా ఎవలో ఇద్దరు కొత్త మనుసులు.

ఆకాశ్ కండ్లలో కొత్త మెరుపు. రామారావు నేలకు తల్కాయేసుకోని కూసుండు. మాట పెగుల్తలేదు. ఏమని పలకరించగలడు.

'ఏమాలోచించిండ్రు' గంగిరెడ్డి మొకం మీదికి నవ్వు తెచ్చుకొని అడి గిండు. రామారావు గుటకలేసిండు. డాక్టరుకు అర్థమైంది. మెత్తబడ్డడు ఈ కాక మీదనే వొంగుతడు అనుకుండు.

కొత్తమనిషి చనువుగా 'ఏం భూములే శిన్నాయిన. పంట పండిచ్చి బాగుపడ్డోడున్నాడే? -అన్నారం కాడ నాది ఇరవై ఎకరాలు. నీటి వసర్తి కూడ వుంది. బేరమొచ్చింది. ముక్కు మొకం సూడకుంట అమ్మేసిన' నువ్వూ అమ్ము అన్నట్టుగ చెప్పిండు.

గంగిరెడ్డికి ఉత్సాహం వొచ్చింది.



## అదే నా బాధ?

"డాక్టర్‌గారూ! మీరు తొందరగా రావాలి. మా ఆవిడ చావు బతుకుల్లో ఉంది"

"మీరేం కంగారు పడకండి. మీ ఆవిడకు ఏమీ కాదు....."

"నా బాధంతా అదే కదా డాక్టర్"

"............"

రామారావు కుడితిల బడ్డ ఎలకోలిగ గిజగిజలాడుతుండు. ఇంటి ముంగల కారాగిన సప్పుడుకు తొంగి సూసిండు. కొడుకుతో పాటు గంగిరెడ్డి, డాక్టరు ఇంకా ఎవలో ఇద్దరు కొత్త మనుసులు. ఆకాశ్ కండ్లలో కొత్త మెరుపు. రామారావు నేలకు తల్కాయేసుకోని కూసుండు. మాట పెగుల్తలేదు. ఏమని పలకరించగలడు.

'డాక్టర్ సాబ్ మోజు పడ్డడు. బెయిట అరవై డెబ్బయ్ కంటె ఎక్కువ పోతలేదు నీకు తెలవంది కాదు కాని నీకు ఎనబై లెక్కన కట్టిస్తనం టుండు. ఇంగ ఆలోచించినవంటె-తలుపుకొట్టిన లచ్చిమిని యెల్లగొట్టినట్టే'.

రామారావు వొంటింట్లె చేరిన కోడిపిల్లలెక్కయిండు. కొడుకు మొకం దిక్కు సూసిండు. తన మౌనానికి వాడు నిప్పులమీద కూసున్నట్టు కూసుండని అర్థమైంది.

'మా బాపు రేటుకాన్నే గుంజాయిషు జేస్తుండు' తండ్రి అనాల్సిన మాటను ఆకాశ్ అందిస్తున్నట్టుగా చెప్పిండు. రామారావుకు నిండ మునిగినట్టుగా అనిపించింది.

'కానియిరి' అన్నడు రామారావు ఇంకొక దారి లేక.

ఆకాశ్ మొకంలో సంబూరం. తను అమెరికా విమానం ఎక్కినట్టుగా గాల్లె తేలిపోయిండు.

'కాని ఆ రేటు పడదు' అన్నడు ఆకాశ్.

డాక్టర్, గంగిరెడ్డి మొకమొకాలు సూసుకుండ్రు.

'ఏం బాపూ! లక్షకాడికయితె యిద్దాం' ఆకాశ్ తండ్రి మొకం దిక్కు సూస్కుంట అన్నడు. రామారావు మూగెద్దు లెక్క తలాడించిండు.

కిందమీద బడ్డంక లక్షకాడికి డాక్టర్ సరే అన్నడు.

వెంట తెచ్చుకున్న స్టాంపు పేపర్ల మీద రాతలు కోతలు అయినయ్. యాభై వేల బయాన రామారావు చేతుల బడ్డది. పదిహేను రోజుల్లో రిజిస్ట్రేషన్ అని లేసి పోయిండ్రు.

** ** **

ఆర్నెల్లల్ల ఆకాశ్‌కు వీసా దొరికింది. విమానం టికెట్ కూడా బుక్క య్యింది. ప్రయాణానికి ఇంకో పదిహేను రోజులు.

రామారావుకు చేతులిరిగినట్టయింది.

మట్టికి మనిషికి అనుబంధం పోతుంది. భూమి కేవలం వో లాభ సాటి బేరమైంది. తను తన తండ్రి తాతలు భూమంటే ఓ పేగు బంధ మనుకుండ్రు. మరి ఇపుడు...

మరి తను తన భార్య సెంటు భూమి లేని ఊల్లె గోల్లు గిల్లుకుంట కూసోవాల్నా? పూలమ్మిన సోట కట్టెలమ్మాల్నా?

అందుకే కొడుకు ప్రయాణానికంటే ముందే తన మకాం నల్లగొండకు మార్సాలనుకుండు. వొచ్చిన డబ్బు- ఆకాశ్ ఖర్చులు పోను బేంకిల పిక్స్ డ్ జేసిండు. ఆ మిత్తితో కట్టేసిన గొడ్డు మేత తిన్నట్టుగా తిని బతకాలె.

తప్పదు అంతకంటె వేరే ఏం చేయగలడు?

రొండు అర్రల పెంకుటిల్లు కూడా ఎవలు కొనే యాల్ల లేదు. ఊల్లె రైతులే అందిన కాడికి అమ్ముకుని నల్లగొండకు పోతుండ్రు. ఊల్లె ఎవ లన్న ఉండాలనుకుంటె గదా ఇల్లు కొనుక్కోవాలనుకునేది.

వొదిలిపెట్టి- వో లారీల సామానేసుకోని పొలిమేర దాటిండు.

లారీ మట్టిరోడ్డు మీద పోతుంది.

అదే కదూ తరతరాల తమ భూమి. అప్పటికే సుట్టూ ఫెన్సింగ్ చేసి నడుం గల నాలుగర్రల డాబా ఇల్లు అందంగా కట్టుంది. దోపిడి వర్గాలు డబ్బున్న దొరలకు విడిది గృహాలు. ప్రకృతి నడుమ దావతులకు పండ్ల తోటల పెంపకాలు, వాల్ల విలాసాలకు.

రామారావు కండ్లనుంచి రొండు కన్నీటి సుక్కలు రాలినయ్.

భూమి డబ్బున్నవాడిది. డబ్బాశ పెట్టి రైతుల నోటికాడి భూమిని గుంజుకుంటుండ్రు. తమ స్టేటస్ సింబల్స్‌గా సూపించుకుంటుండ్రు. ఎస్టేట్స్... రిసార్ట్స్...హోదా. అదే తోటలో మల్లా ఆ వూరి జెనమే కలుపు పీకుతరు. నీల్లు కడ్తరు. కాలువలొచ్చినా నీల్లు పారినా, భూమి చేతులు మారుతుంది కాని మట్టిని నమ్ముకున్న మనిషి గీత మారదు.

రేపు తన కొడుకు కూడా అమెరికా నుంచొచ్చి ఎకరానికి ఏ రొండు లక్షలో నాలుగు లక్షలో పెట్టి వో ఎస్టేట్ కొనొచ్చు. తన స్టేటస్ కోసం.

ఇప్పుడు భూమి రైతుది కాదు - డబ్బుది.

భూమి పంట కోసం కాదు - అదో స్టేటస్ సింబల్.